






ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086



యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కంద్ర కమలాకర్ (29) కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ ప్రాంతంలో ఉంటున్నాడు. కొంత కాలంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నా సఫలం కాకపోవడంతో డిప్రెషన్‌కు గురయ్యాడు. ఈనెల 29న బెడ్‌షీట్‌తో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.







ధన్వంతరి స్వామి కల్యాణం

బాలానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయినగర్‌లోని సాయినాగేంద్ర ఆలయంలో ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ వేడుకలు కనుల పండువగా ముగిశాయి. మూడు రోజుల పాటు సాగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి సునిల్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు







నేడు రన్ ఫర్ యూనిటీ

- హాజరు కానున్న ఎంపీలు ఈటల, కొండా

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రన్ ఫర్ యూనిటీ దశాబ్ది వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక ఛైర్మన్ మాధవరం కాంతారావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిజాంపేట్ క్రాస్‌రోడ్డు ఎదురుగా ఉన్న పటేల్ విగ్రహం నుంచి కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వరకు జాతీయ రహదారి వెంట రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈకార్యక్రమానికి మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం రన్‌ఫర్ యూనిటీలో జాతీయ జెండాలతో వేలాది మందితో ఐక్యతా కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలి

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రంగదాముని చెరువు (ఐడీఎల్ ట్యాంక్) అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఎమ్మెల్యే బుధవారం క్షేత్రస్థాయిలో చెరువు అభివృద్ధి గురించి ఇంజనీరింగ్, ఇరిగేషన్, హుడా అధికారులతో కలిసి పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అల్లాపూర్: చెరువుల్లో అక్రమంగా నిర్మాణాలు చేశారంటూ అల్లాపూర్ డివిజన్ సున్నం చెరువు పరిసరాల్లో అనేక నిర్మాణాలు, గుడిసెలను కూల్చిన విషయం విదితమే. ఆయా ప్రాంతాల్లో తమ గూళ్లు చెదరిన వారికి సాంత్వన కల్పించేందుకు, బడికెళ్లే చిన్నారుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు అల్లాపూర్ కార్పొరేటర్ వినూత్న పద్ధతి అవలంబించారు. బుధవారం ఆమె సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఇళ్లు కోల్పోయిన పేదవారి పిల్లలకు ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు.





సీఐకి శుభాకాంక్షలు

బాలానగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాలానగర్ సీఐ నర్సింహరాజును కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల నరేందర్, ముక్తార్ అహ్మద్ తదితరులు సీఐను శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.





జీహెచ్ఎంసీ అధికారులకు వీడ్కోలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లో పదవీ విరమణ పొందిన డా.ఎస్.సుకునందన్‌రెడ్డి, మూసాపేట్ సర్కిల్ డీసీ అడప రమేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ డి.మల్లేశ్వర్‌కు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జడ్సీ అపూర్వ్ చౌహన్, కూకట్‌పల్లి డీసీ హరికృష్ణయ్య, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి ఇతర ఉద్యోగులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి వారి ఉద్యోగ సేవలను కొనియాడారు. అంతకు ముందు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూసాపేట్ డీసీ రమేష్‌ను శాలువాతో సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, మాధవరం రంగారావు తదితరులు ఉన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో జడ్సీ తదితరులు

ఆర్టీసీ డిపోలో ప్రగతిచక్ర అవార్డుల ప్రదానం



డిపో డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతిచక్ర ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎం హరి, డిపో అధికారులు

ఫతేనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎదుగుదలకు ఉద్యోగులే జీవమని, అందుకే డిపో అభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలని కూకట్‌పల్లిడిపో డీఎం బి.హరి అన్నారు. బుధవారం డిపోలో నిర్వహించిన ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సంలో ఆయన పాల్గొని సెప్టెంబరులో ప్రత్యేక ప్రతిభ కనబరచిన డ్రైవర్, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మరో కార్యక్రమంలో...

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగ విరమణ పొందిన ఏడీసీ టీఎన్ రెడ్డి, శ్రీనివాస్‌ను డిపో డీఎం సత్కరించారు. వారి సేవలను డిపో కార్మికులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఏ ఓవరాల్ చాంప్ 'విజ్ఞాన్స్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఏ) హైదరాబాద్ అంచె పోటీలు ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, కరాటే, స్కేటింగ్, వాలీబాల్ విభాగాల్లో టైటిళ్లు కొల్లగొట్టిన విజ్ఞాన్స్ ది స్కూల్ ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల రన్నరప్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్ టైటిల్‌ను ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఫుట్‌బాల్ టైటిల్‌ను మేరు ఇంటర్నేషనల్ స్కూల్ దక్కించుకున్నాయి. వారం రోజులగా హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో 920 పాఠశాలల నుంచి దాదాపు 23 వేల మంది విద్యార్థులు 22 క్రీడాంశాల్లో పోటీపడడం విశేషం.

శాంపిల్స్ మేమిచ్చాం.. మీరివ్వండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు

ఎంపీ అనిల్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సవాల్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ టెస్ట్‌కు తాము శాంపిల్స్ ఇచ్చామని, దమ్ము, ధైర్యముంటే శాంపిల్స్ ఇవ్వాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. బుధవారం హైదర్‌గూడ అపోలో ఆస్పత్రిలో డ్రగ్స్ నిజ నిర్ధారణ కోసం యూరిన్, డీఓఏ డ్రగ్ ప్యానల్ శాంపిల్స్‌ను వారు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇతరులు డ్రగ్స్ టెస్ట్ కోసం ఏఐజీ ఆస్పత్రికి వస్తానని, సలీం ఫెకూ రాలేదని విమర్శించారు. కేటీఆర్ బామ్మర్ది జరిపిన విందులో ఒకరికి పాజిటివ్ వస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. ఇటీవల కేటీఆర్, కౌశిక్ డ్రగ్స్ తీసుకున్నారేమోనని, అందుకే టెస్ట్ శాంపిల్స్ ఇచ్చేందుకు రావడం లేదన్నారు. రాజకీయాల్లో బాధ్యతల గల పదవిలో ఉన్నపుడు ఆరోపణలు వస్తే నిరూపించుకోవాలన్నారు. హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు ఆ వాతావరణం లేకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు వారి మిత్రులతో కలిసి హైదరాబాద్‌ను డ్రగ్స్ సిటీగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కౌశిక్ ఇకనైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని, నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

జేఎన్‌టీయూ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి

- కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొందరు వ్యక్తులు వర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతిలేదని అడ్డుకున్న జేఎన్‌టీయూ సెక్యూరిటీ సిబ్బందిపై దాడిచేశారు. వారిపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 29న ఓ మహిళ వచ్చి జేఎన్‌టీయూలో పరిచయమున్న వారున్నారు.. లోపలికి అనుమతించమని కోరింది. దానికి సెక్యూరిటీ సిబ్బంది అనుమతించకపోవడంతో ఆమె తరఫున దిలీప్ అనే వ్యక్తి వచ్చి సెక్యూరిటీ సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. ఈ గొడవలో సెక్యూరిటీ కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. జేఎన్‌టీయూ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఫిర్యాదు మేరకు దిలీప్‌తో పాటు ముగ్గురు వ్యక్తులపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు.









ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానని అన్నారు. పద్మానగర్ ఫేజ్-1 కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు బుధవారం హన్మంత్‌రెడ్డిని కలిశారు. నూతన కమిటీని అభినందించిన హన్మంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు కాలనీల అభివృద్ధికి పనిచేయాలని



కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసిన పద్మానగర్ వాసులు

సూచించారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపకుండా అడ్డుకున్నది బీఆర్ఎస్సే

దుండిగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, ఆ పార్టీ నాయకుడు శంభీపూర్ కృష్ణ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలను విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) తిరస్కరించడంలో బీఆర్ఎస్ పార్టీ కీలకపాత్ర పోషించినదని అన్నారు. రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ భారాన్ని మోపకుండా అడ్డుకున్నదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ఆదేశాల మేరకు బుధవారం గండిమైసమ్మ చౌరాస్తాలోని పార్టీ కార్యాలయంలో విజయోత్స సంబురాలు జరుపుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్పొరేటర్లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పేదలను ఇంకా పేదిరికంలోకి నెట్టేలా



పార్టీ కార్యాలయం వద్ద సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఉన్నాయని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచాలని ఈఆర్‌సీకి సిఫారసు చేయడం హేయమైన చర్య అన్నారు. దీనిపై బీఆర్ఎస్ చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వారు వెల్లడించారు.

కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, సుజాత, బాలాజీ నాయక్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు, డివిజన్, వార్డు అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.













ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366


దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై టపాసుల విక్రయాలు


ఫిల్మ్‌నగర్‌లో రావణదహనం చేస్తున్న దృశ్యం


కొత్తపేటలో పూల అమ్మకాలు


బేగంబజార్‌లోని హోల్‌సేల్ దుకాణంలో రద్దీ

పండుగ సందడి

దీపావళి నేపథ్యంలో మార్కెట్లు బుధవారం సందడిగా కనిపించాయి. టపాసుల దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. మరోవైపు పూల దుకాణాలు కూడా కళకళలాడాయి. గురువారం పండుగకు కావాల్సిన కొనుగోళ్లలో నగరవాసులు బిజీబిజీగా గడిపారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు




కూన శ్రీశైలంగౌడ్‌తో సమావేశమైన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ కృషి

షాపూర్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను శ్రీశైలం గౌడ్‌కు వివరించారు. స్పందించిన ఆయన ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధుల మంజూరు చేయించి కాలనీలు, బస్తీలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. శ్రీశైలం గౌడ్‌ను కలిసిన వారిలో జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్, సంక్షేమ సంఘాల ప్రతి నిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



దీపావళి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్, నందానగర్‌లోని శ్రీకృష్ణా టాలెంట్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ హాజరయ్యారు.

- దుండిగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)

సర్కిల్ కార్యాలయంలో...



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వి.నర్సింహ, ఏఎంసీ శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొని పూజలు చేశారు.

- కుత్బుల్లాపూర్ (ఆంధ్రజ్యోతి)

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. టీఎస్ఐఐసీ కాలనీలో నివాసముంటున్న ఎం రాజేశేఖర్(31) జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని థర్మోప్యాడ్స్ పరిశ్రమలో హెచ్ఆర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఉంటున్న ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. యువతి అతడి ప్రేమను నిరాకరించడంతో మనస్తాపం చెందిన రాజశేఖర్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీదవాఖానాపై పతంగులు ఎగురవేస్తుండగా

విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు చిన్నారులకు గాయాలు


కాలిన గాయాలతో చిన్నారులు

జీడిమెట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురైన ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆదిల్(8), ఆదాం(7) స్నేహితులు. బుధవారం సాయంత్రం స్థానికంగా ఉన్న బస్తీదవాఖానా భవనం పైకి ఎక్కి పతంగులు ఎగురవేస్తున్నారు. పక్కన ఉన్న విద్యుత్ తీగలు వారికి తగలడంతో ముఖం, భుజం, చేతి వేళ్లు కొంతమేర కాలిపోయాయి. గమనించిన స్థానికులు గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. అయితే ఈవిషయాన్ని పోలీసులకు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. జగద్గిరిగుట్ట పోలీసులు దీనిపై విచారిస్తున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో

భూ కబ్జాలపై సీబీఐతో విచారణ జరిపించాలి


ఉమామహేశ్

జీడిమెట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన భూ కబ్జాలపై సీబీఐతో విచారణ జరిపించాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమామహేశ్ డిమాండ్ చేశారు. పోలీసులు, రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు సమగ్రమైన నివేదికను ఇచ్చి భూ కబ్జాలను అరికట్టాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల స్వార్థప్రయోజనాల కోసం నియోజకవర్గంలో పనిచేసిన కొంతమంది అధికారులు జైలుపాలు అవుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురైయ్యాయని పేర్కొన్నారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు భూ కబ్జాలకు సహకారం అందించని ప్రభుత్వ అధికారులను బెదిరించిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అధికారులపై, జర్నలిస్టులపై దాడులు చేస్తే ఏమాత్రం చర్యలు తీసుకోలేదని వివరించారు. ఒత్తిళ్లకు లొంగిన అధికారులు బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు చెప్పిన విధంగా చేయడంతోనే జైలుపాలయ్యారన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో కొందరు నాయకులు అదేదారిలో ప్రయాణిస్తున్నారన్నారు.

పెళ్లి పేరిట నమ్మించి.. వివాహితతో సంబంధం

● ఆమె కుమార్తెతో అసభ్య ప్రవర్తన, ఇంట్లో చోరీ ● బాధితురాలి ఫిర్యాదు

బంజారాహిల్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలు సృష్టించాడు. ఆపై ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కుమార్తె మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మానికి చెందిన ఓ మహిళ భర్త, కుమార్తెతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చింది. అనంతరం అస్లాం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అస్లాం.. ఆ మహిళ, ఆమె భర్తకు మధ్య మనస్పర్థలు సృష్టించి దూరం ఉండేలా చేశాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మహిళతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. పెళ్లి చేసుకోకపోగా మహిళ కష్టపడి తెచ్చే డబ్బును తన విలాసాలకు వాడేవాడు. అంతేకాకుండా ఆమె మైనర్ కుమార్తెతో పలుమార్లు అసభ్యరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇటీవలే ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి తీసుకొని తనఖా పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేసుకున్నాడు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖం చాటేశాడు. బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాద చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

బోయిన్‌పల్లి, అక్టోబ రు 30 (ఆంధ్రజ్యోతి): అత్యాచార కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. సికింద్రాబాద్ సింధుకాలనీలో నివసిస్తున్న బొంగుల సాయిలు(54) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి బోయిన్‌పల్లి ఆర్యసమాజ్ ప్రాంతంలో ఉంటున్న ఓ వ్యక్తితో పరిచయమైనది. ఇద్దరూ స్నేహితులు కావడంతో కలిసి పనిచేస్తున్నారు. అప్పుడప్పుడు తండ్రి వద్దకు వస్తున్న చిన్న కుమార్తెపై సాయిలు కన్ను పడింది. బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలికకు కడుపులో నొప్పి వస్తున్నదని కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా 3 నెలల గర్భవతి అని తేలింది. బాలికను తల్లిదండ్రులు అడగగా జరిగిన విషయం చెప్పింది. దీంతో సాయిలుపై 2020లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసును విచారించిన నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ న్యాయ న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అధిక లిమిట్‌తో కొత్త క్రెడిట్ కార్డు ఇస్తామని మోసం

● రిటైర్ ఉద్యోగి బ్యాంక్ ఖాతాలోని రూ. 2.19 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అధిక లిమిట్‌తో కొత్త క్రెడిట్ కార్డు ఇస్తామని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు 68 ఏళ్ల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ. 2.19 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి కెనరా బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఎలాంటి చార్జీలు లేకుండా సుమారు రూ.5 లక్షల లిమిట్‌తో మీకు క్రెడిట్ కార్డు ఆఫర్ చేస్తున్నామని చెప్పాడు. దానికి బాధితుడు సరే అనడంతో వెరిఫికేషన్ కోసమని చెప్పి ఒక లింక్‌ను పంపారు. అతడితో దానిని డౌన్‌లోడ్ చేయించి, అందులో వివరాలు నమోదు చేయించారు. అలాగే కేవైసీ అప్‌డేట్ కోసమని బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు నంబర్, సీవీవీ వివరాలు నమోదు చేయించారు. మరుసటి రోజు ఉదయం వరకు క్రెడిట్ కార్డు అప్‌డేట్ అవుతుందని, కార్డ్‌లెస్ పేమెంట్స్‌కు వినియోగించుకోవచ్చని నమ్మబలికాడు. మరుసటి రోజు అతను ఫోన్‌ను చెక్ చేసుకోగా, బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 2,19,226 లు మొత్తం డెబిట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనీలాండరింగ్ పేరుతో రూ.4.21 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయని, ఏ క్షణంలోనైనా ముంబై పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని వృద్ధురాలిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు రూ.4.21 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగిని(67)కి ఓ వ్యక్తి ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పాడు. సీబీఐ అధికారులు మాట్లాడతారంటూ మరో వ్యకితో వాట్సప్ వీడియో కాల్ మాట్లాడించాడు. ఆమె బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో విదేశాలకు డబ్బు తరలిందని.. కేసులు నమోదయ్యాయని బెదిరించి డిజిటల్ అరెస్టు పేరుతో ఇంటి నుంచి బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. కేసులతో సంబంధం లేకపోతే డబ్బు తిరిగి ఇస్తామంటూ రూ.4,21,357 వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. కాసేపటి తర్వాత మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు బుధవారం వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని గచ్చిబౌలి కమిషనరేట్‌లో నిర్వహించారు. సీపీ అవినాష్ మహంతి ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ జోయల్ డేవిస్, డీసీపీ ప్రసాద్, రవి చంద్రన్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ముకుందరెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఆర్డీవోగా రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవోగా సాయిరాం విధుల్లో చేరారు. వారు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చెరువులకు పూర్వ వైభవం

● పునరుద్ధరణపై హైడ్రా దృష్టి


అధికారులతో చర్చిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెరువుల పునరుద్ధరణపై హైడ్రా దృష్టి సారించింది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఖాజాగూడ తౌటోని కుంటను కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. చెరువు పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించారు. చెరువులోకి వరద నీరు వచ్చే ప్రాంతాలను పరిశీలించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిలుస్తుండడంతో అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి చేరుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ నీరు తౌటోని కుంటలోకి చేరితే ముంపు సమస్య తీరుతుందని స్థానికులు రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు చెరువులోకి వెళ్లేలా చర్యలు తీసుకోవడంతోపాటు తౌటోనికుంట నుంచి దిగువన ఉన్న భగీరథమ్మ చెరువులోకి నీరు చేరేలా కాల్వను పునరుద్ధరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరిగిన చెరువుల పునరుద్ధరణ చేపట్టనున్నట్టు రంగనాథ్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి పరిధుల్లోని ఐదు చెరువుల గొలుసుకట్టు వ్యవస్థను పునరుద్ధరించనున్నట్టు చెప్పారు. చెరువుల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన హైడ్రా.. హైకోర్టు ఆదేశాలు, ఇతరత్రా కారణాలతో ఆచితూచి వ్యవహరిస్తోంది.

పింక్ రంగులో రాజ్‌భవన్

● రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించిన డాక్టర్ రఘురామ్


గవర్నర్‌ను కలిసిన డాక్టర్ పి.రఘురామ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా అక్టోబరును జరుపుకుంటున్న నేపథ్యంలో రాజ్‌భవన్‌ను బుధవారం పింక్ రంగులో అలంకరించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని 2020 నుంచి ఏటా నిర్వహిస్తోంది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ పి. రఘురామ్ గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మను కలిసి రొమ్ము క్యాన్సర్‌పై చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడం, మహిళల్లో ధైర్యం, నమ్మకం, సంకల్పం సందేశాన్ని వ్యాప్తి చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని డాక్టర్ రఘురామ్ తెలిపారు.

గృహ హింస బాధిత మహిళలకు అండగా మహిళా భద్రతా విభాగం


శిఖాగోయల్

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గృహ హింస బాధిత మహిళలకు మహిళా భద్రతా విభాగం అండగా ఉండి అవసరమైన న్యాయ సహాయం అందిస్తుందని మహిళా భద్రతా విభాగం చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. అక్టోబరును ప్రపంచ వ్యాప్తంగా గృహహింస అవగాహన మాసంగా పాటిస్తారని, అందులో భాగంగా రాష్ట్రంలో గృహహింసను నివారించేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంబర్‌పేట, ఎల్బీనగర్, శంషాబాద్ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో 100 మందికిపైగా గృహహింస కేసు బాధితులు పాల్గొని తమ బాధలు పంచుకున్నారన్నారు. గృహహింస కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాలతో బయటపడ్డ 25 మంది తమ సమస్యలు, వాటి నుంచి ఎలా బయటపడి ఇప్పుడు ధైర్యంగా ఉంటున్నామన్నది వివరించారన్నారు. గృహహింసపై విస్తృత అవగాహన కల్పించడంతో బాధితులు ధైర్యంగా ముందుకువచ్చి ఫిర్యాదు లు చేస్తున్నారని శిఖాగోయల్ తెలిపారు. సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా 1,408 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 286 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు తెలిపారు. విదేశాల్లో ఉండే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన ఎన్ఆర్ఐ సెల్‌కు 460 ఫిర్యాదులు వచ్చాయని, వాటిల్లో 152 కేసులను చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించామన్నారు. గృహహింసకు సంబంధించి 040-4963 8510 లేదా 70932 75068 నంబర్లలో సంప్రదించాలని శిఖాగోయల్ ఓ ప్రకటనలో తెలిపారు.

పోకిరీల భరతం పడుతున్న షీటీమ్స్

● 15 రోజుల్లో 71 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలతోపాటు ఆన్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్నవారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషావిశ్వనాథ్ అన్నారు. ఈ నెలలో గడిచిన 15 రోజుల్లో మహిళలను వేధిస్తున్న 71 మందిని షీటీమ్స్ అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిలో 8 మందిపై క్రిమినల్ కేసులు, ఆరుగిరిపై పెట్టీ కేసులు నమోదు చేసి, మిగతావారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడుతూ కుమార్తెలను దూషిస్తూ మానసికంగా వేధిస్తున్న వ్యక్తిపై వనస్థలిపురం షీటీమ్స్ క్రిమినల్ కేసు నమోదు చేశారు. యువతిని వేధించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె అమెరికా వెళ్లినా ఆమెను వేధిస్తుండటం, ఆమె తల్లిదండ్రులపై దాడులు చేస్తామని బెదిరిస్తున్న నిందితుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఎదురింట్లో ఉంటున్న మహిళను అసభ్యకరమైన సైగలు చేస్తూ తొంగిచూస్తూ వేధిస్తున్న వ్యక్తిపై మల్కాజిగిరి షీటీమ్స్ అధికారులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా బస్టాండ్‌లు, మార్కెట్ తదితర బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తున్న పోకిరీలను అదుపులోకి తీసుకొని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.



నార్త్‌జోన్ పరిధిలో టపాసులు విక్రయిస్తున్న వ్యాపారులతో బుధవారం అరెకటిక సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. డీసీపీ స్నేహా మెహ్రా టపాసుల నిల్వ, అమ్మకాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాపారులకు వివరించారు.

- హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)







ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి పున్నారావు: 9985921366

ABN ఆంధ్రజ్యోతి కి
22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పన్నులు సకాలంలో చెల్లించండి. పట్టణ అభివృద్ధికి సహకరించండి.

పరిసరాల పరిశుభ్రతను కాపాడుదాం - పచ్చదనాన్ని పెంచుదాం.

తడి -పొడి చెత్తను విడదీద్దాం పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం.

అధికారిక అనుమతులతోనే ఇళ్ల నిర్మాణం చేసుకుందాం. నగరాన్ని నందనవనంగా మార్చుకుందాం

డిప్యూటీ కమీషనర్
శేరిలింగంపల్లి సర్కిల్-20
టౌన్‌ప్లానింగ్ విభాగం



వి. గంగాధర్ రెడ్డి
గచ్చిబౌలి 105
డివిజన్ కార్పొరేటర్



దాసరి గోపికృష్ణ
శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం,
శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి కమిటీ ఛైర్మన్

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

ప్రతిష్టాత్మకంగా కులగణన


కులగణనపై అవగాహన కల్పిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే చేపట్టాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ మున్సిపల్ కార్యాలయం బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న తారతమ్యాలను అదిగమించేందుకు ప్రభుత్వం ఈ సర్వే ప్రారంభించదన్నారు. మనం ఇచ్చే నివేదిక ఆధారంగానే వివిధ సంక్షేమ ఫలాలు వారికి చేరుతాయన్నారు. అయితే సర్వేలు కచ్చితంగా నిష్పక్షపాతంగా ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా చేస్తేనే అర్హులకు పథకాలు అందే అవకాశం ఉంటుంది అన్నారు. అవి అందాలంటే క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు కచ్చితంగా సర్వే చేయాలన్నారు. ఈ సర్వే రెండు దశల్లో ఉంటుందని, ఒక్కొక్క ఎన్యుమరేటర్ 150 కుటుంబాలను సర్వేచేయాల్సి ఉంటుందని, పదిమందికి ఒక సూపర్‌వైజర్ ఉండి పర్యవేక్షిస్తారని తెలిపారు. నవంబర్ 6 నుంచి 18 వరకు సర్వేను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. మొదటి విడతలో తమకు కేటాయించిన కుటుంబాలను గుర్తించి వాటికి ఇంటినెంబర్లు నమోదుచేసి స్టిక్కర్లు అతికించాలన్నారు. రెండో విడతలో కుటుంబ సభ్యులందరి సామాజిక ఆర్థిక, కుల వివరాలను జాగ్రత్తగా మార్గదర్శకం పుస్తకంలో సూచించిన ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు లోనుకావద్దు.. భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

- యువకులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్



చందానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. గంజాయితో పాటు వివిధ మాదక ద్రవ్యాలను తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఇలాంటి కేసుల్లో పట్టుబడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. స్లమ్‌ఏరియాల్లో పాన్‌డబ్బాలు, చిల్లర దుకాణాల్లో గంజాయి, గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని విక్రయదారుల కోసం ప్రత్యేకటీంలను ఏర్పాటు చేశామని చెప్పారు. పాఠశాల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బుధవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

శేరిలింగంపల్లి మండల పరిధిలో ఎన్ని వైన్స్, బార్లు ఉన్నాయి? నిబంధనలు అతిక్రమిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

శేరిలింగంపల్లి మండలంలో వైన్‌షాపులు-39, బార్‌లు 112 ఉన్నాయి. నిర్వాహకులు సమయపాలన, చట్టపరంగా వ్యవహరించకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

బెల్ట్‌షాపుల్లో క్రయవిక్రయాలు జోరుగా జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

మండల పరిధిలో గతంలో బెల్ట్‌షాపులు ఉండేవి. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని విషయం మా దృష్టికి రాగానే దాడిచేసి వారి దగ్గర ఉన్న మద్యం సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తున్నాం. చర్యలు తీసుకోవడం లేదనేది అవాస్తవం.

యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

యువత మతుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఒక్కసారి అలవాటుపడితే జీవితం నాశనం అవుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి. దీనిపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా మత్తుపదార్థాలతో దొరికితే కేసులు నమోదు చేస్తాం. దీంతో వారి భవిష్యత్ నాశనం అవుతుంది. కావున యువత వీటికి దూరంగా ఉండాలి.

మండల పరిధిలో ఇప్పటి వరకు ఎంత గంజాయి పట్టుకున్నారు?

తాను శేరిలింగంపల్లిలో బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు 750 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. దీనికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రంకూడా అందుకున్నాం.

పీడీ యాక్ట్ కేసులు ఏవిధంగా నమోదు చేస్తారు?

గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరా చేస్తూ రెండు నుంచి మూడుసార్లు పట్టుబడితే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తాం. మండలంలో పీడీ యాక్ట్‌లు, గంజాయి కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఐదు పీడీయాక్ట్ కేసులు నమోదు చేశాం.

యువతకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి?

మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. యువతే దేశానికి వెన్నుముక. మాదకద్రవ్యాలకు బానిసయితే యువతరంతో పాటు దేశాభివృద్ధి కుంటుపడుతుంది. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులను గంజాయి వైపు మళ్లేలా కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాంటివారి ఉచ్చులో విద్యార్థులు చిక్కుకోకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం


డీసీ అడప రమేష్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ రంగారావు

హైదర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అడప రమేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీడీ మల్లేశ్వర్, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ సుకనందన్ రెడ్డిని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీతో తనకు కార్పొరేటర్‌గా ఉన్నప్పటి నుంచి సుమారు 15 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ హెడ్‌ఆఫీస్‌లో సెక్రటరీ సెక్షన్‌లో పనిచేస్తూ అనంతరం వివిధ సర్కిల్ కార్యాలయంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్, ఆర్డీఓలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ముకుందరెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఆర్డీఓగా రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీఓగా సాయిరాం విధుల్లో చేరారు. వారు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.







ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

ఆకాశాన్ని అంటిన పూలధరలు

జనాలతో కిటకిటలాడిన మార్కెట్లు



పూలు, పూజాసామగ్రి కొంటున్న ప్రజలు

మియాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్య కాంతుల దీపాలతో ప్రతి ఇంట జరిగే పండుగే దీపావళి. ఈ పండుగకు భారతీయ హితిహాసాలు, సంప్రదాయాల్లో ఓ ప్రత్యేకత ఉంది. నాటి నుంచి నేటి వరకు కులమతాలకు అతీతంగా జరుపుకునే ఈ పండుగను చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి మెలిసి జరుపుకుంటున్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని మార్కెట్లు గొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. దీంతో పూజకు ఉపయోగించే పూల రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. చామంతి కిలో రూ.450, బంతి రూ.300 ధరలు పలుకుతున్నాయి. అదేవిధంగా ప్రతిమలు, దొంతుల రేట్లు సైతం పెంచేశారు. ముఖ్యంగా నగరంలో దొంతులకు ఓ ప్రత్యేకత ఉంది. ఇందులో భాగంగానే ధరలు విపరీతంగా పెంచినట్లు కొనుగోలుదారులు వాపోతున్నారు. ఢిల్లీ, మహారాష్ట్రాల నుంచి దొంతులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.



నియోజకవర్గంలో దీపావళి సందడి

అందుబాటులో పలురకాల టపాసులు ● జాగ్రత్తలు పాటించాలంటున్న పర్యావరణవేత్తలు



బాణసంచా దుకాణాలు, అమ్మకాలకు సిద్ధంగా ఉన్న టపాసులు

రాయదుర్గం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు ఓ ప్రత్యేకత ఉంది. దివ్యకాంతులతో విరజిల్లే ఈ దీపావళిని దేశ ప్రజలందరూ ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా నగరంలో జరుపుకునే పండుగకు ప్రత్యేక ఉంది. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఈ పండుగ నియోజకవర్గంలో భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ ముందు నుంచే బస్తీలు టపాసుల శబ్దాలతో మార్మోగుతుంటాయి. మాదాపూర్, మియాపూర్, చందానగర్, మదీనగూడ, లింగంపల్లి, రాయదుర్గం, కొండాపూర్ ప్రాంతాల్లో టపాస్‌ల దుకాణాలు వెలిసాయి. రకరకాల క్రాకర్స్‌ను ప్రజల కోసం వ్యాపారులు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా దీపావళి అంటే చిన్నారులు, యువత టపాస్‌లు కాల్చడానికి ఉత్సాహం చూపిస్తారు. వీరి అభిరుచికి తగినట్లే వ్యాపారులు రకరాల టపాస్‌లు అందుబాటులో ఉంచారు. అయితే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణవేత్తలు వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా తక్కువ శబ్దాలు వచ్చేవి కాల్చాలంటున్నారు. చిచ్చుబుడ్లు, భూచక్రాలు, ఫూల్‌ఛడీ, పెన్సిల్స్ కాల్చాలని, రాకెట్లు వంటివాటివి వినియోగిస్తే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని కోరుతున్నారు.

గడువు తీరిన బాణసంచాతో జాగ్రత్త

బాణసంచా కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలి. కొంతమంది వ్యాపారులు గతేడాది నిల్వ ఉంచిన మతాబులు, బాణసంచాను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఇలాంటి గడువు తీరిన వాటిని కాల్చితే అవి మిస్‌ఫైర్ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పేలే అవకాశం లేని మతాబులు సైతం అధికంగా మండటం లేదా ఒక్కసారిగా ఢాం అంటూ పేలడం వల్ల గాయాల పాలయ్యే ప్రమాదం ఉంది. కొనుగోలు చేసేటప్పుడు తయారీ, గడువు తేదీని గమనించాలి.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి



ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే బాణసంచా దుకాణదారులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. విద్యుత్‌వైర్ల కింద ఏర్పాటు చేయకూడదు. దుకాణానికి దుకాణం మధ్య దూరం ఉండాలి. గడువు తీరిన టపాసులు అమ్మకాలు చేయకూడదు. అగ్నిప్రమాదాలు జరగకుండా సెఫ్టీ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు కూడా కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

- వెంకన్న, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్

పరిష్కారం ఇలా..

- తక్కువ శబ్దం వచ్చే చిచ్చుబుడ్లు, భూచక్రాలు, ఫూల్‌ఛడీ, పెన్సిల్స్ కాల్చాలి.
- అధిక శబ్దాలు వినిపించే ప్రాంతాల్లో ఇయర్ ప్లగ్‌లు వాడాలి.
- శబ్దాలు కాకుండా వెలుగు విరజిమ్మే మతాబులను ఎంపిక చేసుకోవాలి.
- విపరీత శబ్దాలు కర్ణభేరికి సోకకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలి.
- టపాసుల మోత శృతిమించికుండా ఉండేందుకు కాలనీ సంక్షేమ సంఘాలు ప్రయత్నించాలి.

పిల్లలూ ఈ జాగ్రత్తలు పాటించాలి..

- టపాసులు కాల్చేటప్పుడు నూలు దుస్తులనే ధరించాలి. లోదుస్తులు కూడా నూలువే ఉండాలి. పట్టు వస్త్రాలు, నైలాన్ వంటి సింథటిక్ దుస్తులు ధరించకూడదు.
- పెద్దల సమక్షంలో చిన్నారులు క్రాకర్స్ కాల్చే విధంగా చూడాలి.
- వదులుగా ఉండే పావడాలు, ఘాగ్రాలు వద్దు. అలాగని మరీ టైట్‌గా ఉండే దుస్తులు వేసుకున్నా కష్టమే. నిప్పురవ్వలు మీద పడితే తక్షణం తొలగించ డానికి వీలుగా ఉండాలి.

టపాసుల కాలుష్యంతో వెలువడే కాలుష్య కారకాలు, వాటితో తలెత్తే అనర్థాలు

క్యాడ్మియం: ఎనీమియాతో పాటు కిడ్నీలు, నరాల వ్యవస్థ దెబ్బతింటుంది.
సల్ఫర్‌డయాక్సైడ్: శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఆస్తమా.
కాపర్: ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. దగ్గు, బ్రాంకైటిస్ సమస్యలకు కారణమౌతుంది.
లెడ్: కేంద్రీయ నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది.
మేగ్నీషియం: జ్వరం, శ్వాసకోశాలకు ఇబ్బందులు కలిగిస్తుంది.
నైట్రేట్: మెదడు తీవ్రంగా ప్రభావితమౌతుంది. చర్మ సమస్యలు, ఇరిటేషన్,చిన్నారుల్లో శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి.

కొత్త క్రెడిట్ కార్డు ఇస్తామని టోకరా!

● బ్యాంక్ ఖాతాలోని రూ. 2.19 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ లిమిట్‌తో కొత్త క్రెడిట్ కార్డు ఇస్తామని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు 68 ఏళ్ల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ. 2.19 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి కెనరా బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఎలాంటి చార్జీలు లేకుండా సుమారు రూ. 5 లక్షల లిమిట్‌తో మీకు క్రెడిట్ కార్డు ఆఫర్ చేస్తున్నామని నమ్మించారు. దానికి బాధితుడు సరే అనడంతో వెరిఫికేషన్ కోసమని చెప్పి ఒక లింక్‌ను పంపారు. అతడితో దానిని డౌన్‌లోడ్ చేయించి, అందులో వివరాలు నమోదు చేయించారు.

అలాగే కేవైసీ అప్‌డేట్ కోసమని బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు నంబర్, సీవీవీ వివరాలు నమోదు చేయించారు. మరుసటి రోజు ఉదయం వరకు క్రెడిట్ కార్డు అప్‌డేట్ అయిపోతుందని, కార్డ్‌లెస్ పేమెంట్స్‌కు వినియోగించుకోవచ్చని నమ్మబలికాడు. మరుసటి రోజు అతను ఫోన్‌ను చెక్ చేసుకోగా, బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 2,19,226లు మొత్తం డెబిట్ అయ్యాయి. ఖాతాలో సున్నా బ్యాలెన్స్ ఉంది. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మంజులారెడ్డి

చందానగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులకు, మరికొన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు చేసేలా నిధులను మంజూరు చేయాలని చందానగర్ కార్పొరేటర్ మంజులా రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శివాజీనగర్, భవానిపురం, సిటిజన్ కాలనీ, తదితర కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని కోరారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

సీసీరోడ్డును పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్ వెస్ట్‌కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డును వాటర్‌తో క్యూరింగ్ చేయాలన్నారు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని పచ్చని వనంలాగా మార్చుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో స్థానికులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సంతోష్, బిరాదర్, ఉమేష్, సంతోష్, రాజుగౌడ్, కార్తీక్, వినిత్, వర్క్ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

నేడు కేపీహెచ్‌బీలో రన్ ఫర్ యూనిటీ

హాజరు కానున్న ఎంపీలు ఈటల, కొండా

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రన్ ఫర్ యూనిటీ దశాబ్ది వేడుకలను గురువారం నిర్వహిస్తున్నామని స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక చైర్మన్ మాధవరం కాంతారావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిజాంపేట్ క్రాస్‌రోడ్డు ఎదురుగా ఉన్న పటేల్ విగ్రహం నుంచి కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వరకు జాతీయ రహదారి వెంట రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం రన్‌ఫర్ యూనిటీలో జాతీయ జెండాలతో వేలాది మందితో ఐక్యతా కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిధులివ్వండి

హైదర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు పూర్తిచేయాలని, మంచినీటి వసతిని మెరుగు పరచాలని, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, పారిశుధ్య పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన గాంధీ మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తామని, ప్రజలకు అన్నిరకాల మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం, అనిల్, కృష్ణముదిరాజ్, నరేందర్‌ముదిరాజ్, సజీవ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పత్రం పంపిణీ

● మాదాపూర్‌కు చెందిన పోచమ్మ అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. దీంతో బుధవారం ఎమ్మెల్యే గాంధీ లబ్ధిదారు కుటుంబ సభ్యులకు రూ.3లక్షల మంజూరు పత్రాన్ని అందజేశారు.



నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గాంధీని కోరుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబసభ్యులతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరు కలిసి సోదర భావంతో పండుగ జరుపుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించే టపాసులు కాకుండా గ్రీన్‌క్రాకర్స్‌ను వినియోగించాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.





ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086